సాక్షి
వరంగల్
మంగళవారం | 24 | జనవరి | 2023



భక్తులకు ఇబ్బంది కలగొద్దు

త్వరలో ప్రారంభమయ్యే మినీ మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

- 8లో



క్రీడలతో ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి

- 8లో

క్రీడాకారులు, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ ఓరుగల్లు ఖ్యాతిని చాటాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
30.0°/16.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

గ్రంథాలయాల స్థాపనకు రూ.లక్ష విరాళం



కాశీబుగ్గ సెంటర్: విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచేందుకు, పోటీ పరీక్షలకు సిద్ధం చేసేందుకు జిల్లాలో గ్రంథాలయ స్థాపనకు గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు రూ.లక్ష విరాళాన్ని కలెక్టర్ గోపికి అందించారు. ఈసందర్భంగా గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యులను కలెక్టర్ అభినందించారు. ఈకార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దాసరి మురళీధర్ రెడ్డి, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స, డీఆర్డీ ఓ సంపత్‌రావు, వ్యవసాయ అధికారి ఉషాదయాళ్, డీసీఓ బి.సంజీవరెడ్డి, డీఎంఓ ప్రసాద్ రావు, సీపీఓ జీవరత్నం తదితరులు పాల్గొన్నారు.

6,493 మందికి కంటి పరీక్షలు

గీసుకొండ: జిల్లాలో కంటి వెలుగు కింద సోమవారం 44 కంటి పరీక్ష కేంద్రాల ద్వారా మొత్తం 6,493 మందికి కంటి పరీక్షలు చేసినట్లు డీఎంహెచ్ఓ కె.వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 1906 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేసి, 1026 మందికి ప్రిస్క్రిప్షన్ గ్లాసుల కోసం సిఫార్సు చేసినట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో రికార్డుల తనిఖీ



పర్వతగిరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ మహేందర్‌జీ సోమవారం కార్యాలయ రికార్డుల్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలు ఏమైనా ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యాలయంలో అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యార్థులు ఎన్‌సీసీలో రాణించాలి

- తెలంగాణ బెటాలియన్ హవల్దార్ గౌస్



నెక్కొండ: విద్యార్థి దశ నుంచే ఎన్‌సీసీలో రాణించాలని 10వ తెలంగాణ బెటాలియన్ హవల్దార్ మహ్మద్ గౌస్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు 'ఏ' సర్టిఫికెట్ పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు ఎన్‌సీసీ కెడేట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పరీక్షల్లో 20 మంది కెడేట్లు పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం కెడేట్లకు 'ఏ' సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ రంగారావు, ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ వినయ్‌కుమార్, ఇన్‌చార్జ్ హెడ్మాస్టర్ మీర్ ఇక్బాల్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దేశీ మిర్చి క్వింటా రూ.72,500

- పత్తి క్వింటాకు గరిష్ట ధర రూ.7,825

వరంగల్ రూరల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం దేశీమిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.72,500 పలికినట్లు వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి.రాహుల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వండర్‌హాట్ మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.37 వేలు, కనిష్ట ధర రూ.30 వేలు పలికింది. యూఎస్–341 క్వింటాలుకు గరిష్ట ధర రూ.29.5 వేలు, కనిష్ట ధర రూ.16 వేలు పలికింది. తేజ రకం మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.18,700లు, కనిష్ట ధర రూ.14 వేలు పలికింది. తాలు క్వింటాకు గరిష్ట ధర రూ.8500, కనిష్ట ధర రూ.4 వేలు పలికింది. సోమవారం ఒక్కరోజే 10,045 మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి.

పత్తి ధర ఇలా..

సోమవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో పత్తి క్వింటాలుకు గరిష్టంగా రూ.7825, కనిష్ట ధర రూ.6300 పలికింది. లూజ్ పత్తి క్వింటాకు గరిష్ట ధర రూ.7900, కనిష్ట ధర రూ.7450 పలికింది. మొత్తం 5169 పత్తి బస్తాలు యార్డుకు అమ్మకానికి వచ్చాయి.

సెల్యూట్..



జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారులు ఆపిన బాల్య వివాహాలు

2019–46
2020–69
2021–67
2022–46

బాల్య వివాహాల్ని ఎదిరించిన బాలికలు

- చదువే ఆయుధంగా ముందుకు
- నేడు జాతీయ బాలికల దినోత్సవం

సాక్షి, వరంగల్: నేటి బాలికలకు సమాజం సెల్యూట్ చేస్తోంది. బాల్యంలోనే వివాహం చేసేందుకు తల్లిదండ్రులు సిద్ధపడితే ఒకరు ధైర్యంగా వద్దన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరొకరు తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, చదువుకోవాలనుందని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇంకొకరు అనారోగ్యాన్ని జయించి మళ్లీ చదువుకునేందుకు ఆరాటపడుతున్నారు. బాలికల్లో వెల్లువెత్తిన చైతన్యానికి ఇప్పుడంతా సెల్యూట్ చేస్తున్నారు. సామాజిక స్పృహతో స్థానికులు సైతం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేసి బాల్య వివాహాల్ని ఆపుతున్నారు. బాలికల భవిష్యత్‌కు అండగా నిలుస్తున్నారు. మంగళవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా.. ఆదర్శప్రాయమైన బాలికల గురించి..

◆ రాయపర్తి మండలం ఊకల్ హవేలిలో ఓబాలిక తాను ఇంటర్ చదువుతున్న సమయం(2020)లో తండ్రి వివాహానికి నిశ్చయించాడు. విషయం తెలుసుకున్న బాలిక నర్సంపేటలోని ఓ స్నేహితురాలి ఇంటికి వెళ్లి బాల్య వివాహం నుంచి రక్షించాలని జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారి మహేందర్‌రెడ్డికి వాట్సాప్ ద్వారా ఓ లెటర్ పోస్టు చేసింది. ఆమెను రక్షించిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)ఎదుట హాజరుపర్చారు. వారి ఆదేశాల మేరకు సుబేదారిలోని బాలికల సదనంలో ఉంచి చదివించారు. ఇంటర్ పూర్తయ్యాక సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో ఆమెకు సీటు వచ్చింది. ప్రస్తుతం రెండో సంవత్సరం చదువుతోంది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని కాలేజ్ ఎట్ హోంలో ఉంటూ ఆమె చదువును కొనసాగిస్తోంది.

◆ 2021లో రాయపర్తి మండలం కొండూరు జగ్గు తండాకి చెందిన పదో తరగతి విద్యార్థి తన పెళ్లి ఆపాలని చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు ఫోన్ చేసింది. వెంటనే బాలల సంరక్షణ విభాగాధికారులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. ప్రస్తుతం ఆ అమ్మాయి జనగామలోని ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. బాగా చదివి ఉన్నత స్థానంలో ఉండాలనుంది అని ఆమె చెబుతోంది.



◆ సంగెం మండలం కుంటపల్లి గ్రామానికి చెందిన ఎండీ.నజియా ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్‌లో 912 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. 2019లో హనుమకొండలోని కేడీసీలో బీకాం ఫస్ట్ ఇయర్ చదువుతున్నప్పుడు ఆమెకు వైరల్ జ్వరం వచ్చింది. జ్వరంతో చేతులు, కాళ్లు చచ్చుబడిపోయాయి. మాట కూడా సరిగ్గా రాని స్థితిలో మంచానికే పరిమితమైంది. తండ్రి లేని ఆమె ఎదుర్కొన్న ఇబ్బందుల్ని 'సాక్షి' కథనం ప్రచురించింది. విషయం తెలుసుకున్న సహృదయ అనాథాశ్రమం, బాలల సంరక్షణ విభాగాధికారులు మెరుగైన వైద్యం అందిచారు. ఇప్పుడు భయానక పరిస్థితి నుంచి కోలుకొని మళ్లీ చదవాలని ఆరాటపడుతోంది.



◆ నర్సంపేటకు చెందిన మహమ్మద్ పాషా ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్నాడు. కరోనా కారణంగా 2021లో ఉద్యోగం పోయి ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. ఇతడికి ఇద్దరు కూతుళ్లు. పెద్ద కుమార్తె మహిమూదా టెన్త్ పాసై పాలిటెక్నిక్ ఎంట్రెన్స్‌తో పాటు ఇంటర్ ఆన్‌లైన్ క్లాస్‌లకు హాజరవాల్సి ఉండగా.. ఇంట్లో స్మార్ట్‌ఫోన్ లేక తన కుటుంబ పరిస్థితిని బంధువుల ఫోన్ నుంచి ట్విట్టర్ ద్వారా అప్పటి కలెక్టర్ హరితకు విన్నవించింది. డీసీపీఓ మహేందర్‌రెడ్డి ద్వారా ఆ కుటుంబ వివరాలు తెలుసుకున్న కలెక్టర్ హరిత రూ.10వేల స్మార్ట్‌ఫోన్ పంపించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో చదువుతోంది.

బాలికలకు భవిష్యత్‌నివ్వండి...



బాల్య వివాహాల వల్ల బాలికల భవిష్యత్ నాశనం అవుతోంది. విద్య కుంటుపడుతోంది. చిన్న వయస్సులో గర్భం దాల్చడం వల్ల బిడ్డలు అనారోగ్యంతో పుట్టే అవకాశం ఉంది. ప్రీ మెచ్యూర్ బేబీ (నెలల నిండకముందే) తల్లి, బిడ్డలు అనారోగ్యంబారిన పడే అవకాశం ఉంది. బాల్య వివాహాలు చేసిన వారిపై, ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రోత్సహించినవారిపై చట్టపరమైన చర్యలుంటాయి. రెండేళ్ల వరకు జైలు శిక్ష, లేదా రూ.లక్ష జరిమానా, లేదంటే రెండు ఒకే సారి విధించవచ్చు. అయితే బాలికలకు బంగారు భవిష్యత్ ఇచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలి. ఆర్థిక సమస్యలున్నా చదువుకునేందుకు ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి.

– గోపి, కలెక్టర్, వరంగల్

అర్జీలు సత్వరమే పరిష్కరించండి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ గోపి

- కలెక్టర్ గోపి
- గ్రీవెన్స్‌లో ఫిర్యాదుల స్వీకరణ

కరీమాబాద్: ప్రజా సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ గోపి అన్నారు. గ్రీవెన్స్ సందర్భంగా సోమవారం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌కు వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించే వీలు లేని వాటిని గుర్తించి, అందుకు గల కారణాల్ని దరఖాస్తుదారుడికి వివరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరులో అధికారులు జవాబుదారీతనం చూపించాలన్నారు. పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మొత్తం 71 దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకాడే, శ్రీవత్స, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా భూమిలోకి మమ్మల్నే రానివ్వట్లేదు



రోడ్డు అవతల ఉన్న మా వ్యవసాయభూమిలోకి వెళ్లనివ్వకుండా సాంబశివరావు అనే వ్యక్తి అడ్డుకుంటున్నాడు. ప్రభుత్వ రోడ్డును అక్రమించి పెంటకుప్ప ఏర్పాటు చేయడమే కాకుండా మాకు ఇబ్బందులు కలిగిస్తున్నాడు. ఈవిషయంపై 2018 నుంచి తిరుగుతున్నాం. కలెక్టర్‌లు మారినా.. మా సమస్య పరిష్కారమవడం లేదు.

– మండలపు ఎలమంద, గుంటూరుపల్లి, సంగెం

సమస్య పరిష్కారం కాలేదు..



మా వంతుకు వచ్చిన 1.17 ఎకరాలకు సంబంధించి మూడుసార్లు సర్వే చేయించినా సమస్య పరిష్కారం కాలేదు. గ్రామానికి చెందిన మొగిళి అందులో కొంత భూమి నాదే అంటూ సమస్యలు సృష్టిస్తున్నాడు. ఎమ్మార్వోను కలిసినా, సర్వేలు చేయించినా ఎక్కడి సమస్య అక్కడే ఉంది. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశా.

– నాగెల్లి కొంరయ్య, తిమ్మంపేట, దుగ్గొండి

స్వయం ఉపాధి కల్పించాలి..



ఒక కేసు విషయంలో తొమ్మిదేళ్లు సెంట్రల్ జైల్లో ఉన్నాను. విడుదలయ్యాక జైలు ఆధ్వర్యంలో నడిపిస్తున్న పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్న. కుటుంబ పోషణ కోసం నాకు ఆర్థిక సాయం చేసి స్వయం ఉపాధి కల్పించాలని కలెక్టర్‌ను వేడుకుంటున్నా.

– గట్టు సుధాకర్, వరంగల్

భూమి రికార్డుల్లో చూపిస్తలేదు



నాకున్న రెండెకరాల భూమిలో 19 గుంటలు రికార్డుల్లో చూపించట్లేదు. ఈవిషయంలో ఎన్నిసార్లు ఎమ్మార్వో ఆఫీసు చుట్టు తిరిగినా ధరణిలో పెండింగ్‌లో ఉందంటున్నారు. ఇప్పుడు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించాను.

– వేముల మోహన్‌రెడ్డి, లక్ష్మీపురం, దుగ్గొండి

పింఛన్ కోసం తిరుగుతున్నా..



నాకు కాళ్లు, చేతులు పనిచేయట్లేదు. సదరం క్యాంపునకు వెళ్లినా పింఛన్ సాంక్షన్ చేయలేదు. కలెక్టర్ సారును కలిసేందుకు వచ్చిన.

– గుగులోతు భద్రమ్మ, తోపనగడ్డ తండా, చెన్నారావుపేట

శివాలయ పునఃప్రతిష్ఠాపనలో పాల్గొనండి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- అధికారులు, నాయకులతో సమీక్ష



మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు, ఎమ్మెల్యే రమేశ్

పర్వతగిరి: మండల కేంద్రంలోని పర్వతాల శివాలయం పునఃప్రతిష్ఠాపన ఈనెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి సమీప ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈమేరకు మండల కేంద్రంలో సోమవారం ఆలయ పునఃప్రతిష్ఠపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. కాకతీయుల కాలంలో నిర్మించిన పర్వతాల శివాలయం పునఃప్రతిష్ఠాపన సందర్భంగా భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా వసతి ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం పార్కింగ్, భోజన, తాగునీటి వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పర్వతగిరి నుంచి శివాలయం వరకు రవాణా సదుపాయం ఏర్పాటు చేసినట్లు, వృద్ధులు, వికలాంగులు గుట్ట మీదకు వెళ్లి దర్శించుకునేందుకు వీలుగా వాహనాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం పెద్ద రిజర్వాయర్‌లో బోటింగ్ వసతుల్ని ఆయన పరిశీలించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ మాట్లాడుతూ.. పునఃప్రతిష్ఠాపన జరిగే మూడు రోజుల్లో అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమన్వయకర్త వి.రవీందర్‌రావు, మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రావు, సూపరింటెండెంట్ మల్లేశం, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునిత, డీఆర్డీఓ సంపత్‌రావు, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకరయ్య, జెడ్పీ సీఈఓ సాహితీమిత్ర, ఆర్డీఓ మహేందర్‌జీ, డీసీపీ వెంకటలక్ష్మి, ఐబీ ఈఈ ఆంజనేయులు, ఆర్‌అండ్‌బీ ఈఈ జితేందర్‌రెడ్డి, పర్యాటకశాఖ జిల్లా అధికారి శివాజీ, డీపీఓ కల్పన, స్థానిక సర్పంచ్ చింతపట్ల మాలతీసోమేశ్వర్‌రావు, ఎంపీటీసీలు మాడుగుల రాజు, బొట్ల మహేంద్ర, ఉపసర్పంచ్ రంగు జనార్దన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ల భవితవ్యమేంటి?
'సింగరేణి' పబ్లిక్ రంగంగానే ఉండాలి
క్రిస్టియన్, ముస్లింలపై దాడులను అరికట్టాలి
- వివరాలు 10లో

వేతనాల్లేక కార్మికుల వెతలు

- ఇబ్బందుల్లో ఔట్‌సోర్సింగ్ కార్మికులు
- ప్రతినెలా ఇప్పించాలని వేడుకోలు



నర్సంపేట జిల్లా ఆస్పత్రి

నర్సంపేట రూరల్: సమయానికి జీతాలు రాక ఔట్ సోర్సింగ్ కార్మికుల వెతలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. జీతాలు రాకపోవడంతో కుటుంబాలు గడవని దుస్థితి. వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉన్నతాధికారులకు చెప్పినా పట్టించుకోవట్లేదని, ఏజెన్సీలు ప్రతినెలా అందించాలని కార్మికులు కోరుతున్నారు. నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రిలో 24 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. స్టాఫ్ నర్సులు ఏడుగురికి ఒక్కొకరికి రూ.22,500, పారామెడికల్ స్టాఫ్ ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.19,500, స్వీపర్లు 11 మందికి ఒక్కొక్కరికి రూ. 15,600 వేతనానికి ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఆస్పత్రుల్లో నియమించారు. అయితే ప్రతీ నెలా జీతాలివ్వకుండా నాలుగు, ఐదునెలలకోసారి ఇస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. ఆ ఇచ్చిందాంట్లోనూ ఒకటి, రెండు నెలల వేతనమే ఇస్తున్నారు. దీంతో కార్మికులు ప్రతీ రోజు కష్టపడినప్పటికీ సకాలంలో డబ్బులు రాక కుటుంబ పోషణ భారంగా మారుతోందని వాపోతున్నారు. గత నాలుగు నెలలుగా ఈసిబ్బందికి జీతాలందలేదు. అందులో ఒకే నెలకు సంబంధించిన వేతనాలివ్వడంతో తాము అప్పులు తెచ్చుకొని కుటుంబాలను పోషించాల్సి వస్తోందని కార్మికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రతి నెలా జీతాలొచ్చేలా చూడాలని కోరారు.

సాంకేతిక సమస్యలతోనే ఆలస్యమైంది..



ఔట్‌సోర్సింగ్ జీతాలు ఆలస్యమైన విషయం వాస్తవమే. నాలుగు నెలల జీతాలు ఆగాయి. ఒక నెల జీతాలు గత పదిరోజుల కిందటే అందించాం. మిగతావి అందించే సమయంలో అసిస్టెంట్ ఫైనాన్స్ ఆఫీసర్ బదిలీ అయ్యారు. సాంకేతిక సమస్యలు రావడంతో జీతాలు ఆలస్యమయ్యాయి. మూడు నెలల జీతాలు అందిస్తాం. వారం క్రితమే చెక్కు తయారు చేసి పంపించాం.

– డాక్టర్ గోపాల్, సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి నర్సంపేట

సాగుకు 30 శాతం నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న పెద్దారపు రమేశ్

నర్సంపేట: దేశ వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు కేంద్ర బడ్జెట్‌లో కనీసం 30 శాతం నిధులు కేటాయించాలని ఏఐకేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేశ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు అఖిల భారత రైతు సమాఖ్య(ఏఐకేఎఫ్) రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు వస్కుల మట్టయ్య అధ్యక్షతన సోమవారం పట్టణంలోని ఓంకార్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునే సందర్భంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని జనవరి 26న జిల్లా కేంద్రంలో నిర్వహించే వాహనాల ర్యాలీలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రైతుల రుణాల్ని రద్దు చేసేందుకు పార్లమెంటులో రుణ విమోచన చట్టం చేయాలన్నారు. విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి, నాయకులు పరికరాల భూమయ్య, కక్ర రాజిరెడ్డి, మంద భద్రయ్య, సోమయ్య పాల్గొన్నారు.

ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

నర్సంపేట: మోదీ ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఆరెల్లి కృష్ణ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో ఆర్‌ఎస్‌ఎస్ బీజేపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఫాసిస్టు ప్రమాదం ఎన్నో రెట్లు పెరిగిందన్నారు. ముస్లిం, క్రిస్టియన్, దళితులు, ఆదివాసీలు, మహిళలపై దాడులు, హత్యలు పరస్పరం కొనసాగుతున్నాయన్నారు. పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకటి రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, సారంగపాణి, పీవైఎల్ నాయకులు ధనసరి సురేశ్, సుమన్, భిక్షపతి, అశోక్, ఏఐకేఎంఎస్ నాయకులు మల్లయ్య, వీరస్వామి, సాంబన్న, ఐఎఫ్‌టీయూ నాయకులు కుమార్, ఐలన్న, పీఓడబ్ల్యూ నాయకులు పూలక్క, చైతన్య, సరోజన, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు గుర్రం అజయ్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలు వినియోగించుకోవాలి

- యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ సత్యం
- రూ.20 కోట్ల రుణాల పంపిణీ

గీసుకొండ: బ్యాంకు సేవల్ని సద్వినియోగం చేసుకుంటూ.. సకాలంలో చెల్లించాలని యూనియన్ బ్యాంకు రీజినల్ మేనేజర్ పలుగుల సత్యం అన్నారు. సోమవారం కోటగండి సమీపంలోని పీడీ ఆర్ గార్డెన్స్‌లో వ్యవసాయ రుణ విస్తరణ మహోత్సవంలో భాగంగా ఎస్‌హెచ్‌జీ మహిళలు, రైతులు, ఖాతాదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ (ముంబాయి సెంటర్ ఆఫీస్) పంకజ్‌కుమార్, డిప్యూటీ ఆర్‌హెచ్ వజీర్ సుల్తాన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలిరాజు, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, డీపీఎం అనిత, ఎపీఎంలు సురేశ్‌కుమార్, కిషన్, గీసుకొండ బ్రాంచ్ మేనేజర్ రణధీర్, ఊకల్ బ్రాంచి మేనేజర్ భాస్కర్, నర్సంపేట బ్రాంచ్ మేనేజర్ పవిత్రన్, సంగెం బ్రాంచ్ మేనేజర్ అనిల్, సీసీలు కోల శోభ, సుజాత, అశోక్, కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా గీసుకొండ,ఊకల్, సంగెం, నర్సంపేట యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌ల పరిధిలో రూ.20 కోట్ల రుణాలు పొదుపు సంఘాల మహిళలకు, వ్యవసాయ అవసరాల కోసం రైతులకు పంపిణీ చేశారు.

చిరుధాన్యాల సాగు మేలు

- తక్కువ పెట్టుబడి, అధిక లాభం
- రైతులకు అవగాహన సదస్సు



గీసుకొండ: ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయశాస్త్రవేత్తలు, రైతులు, విద్యార్థులు తదితరులు



దుగ్గొండి: మాట్లాడుతున్న శాస్త్రవేత్త నర్సయ్య

గీసుకొండ: చిరుధాన్యాల సాగుకు పెట్టుబడి ఖర్చు, తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుందని, పర్యావరణహితంగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సోమవారం మండలంలోని కొనాయమాకులలో రైతులు, విద్యార్థులతో చిరుధాన్యాల సాగుపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతు వేదికలో అంతర్జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం–2023 సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. రైతులకు సాగు లాభాలు తదితరాలపై వివరించారు. ఇందులో వరంగల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, మామునూరు కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, ఎస్‌ఎఫ్‌ఎస్‌ఎం జిల్లా కన్సల్టెంట్ సారంగం చిరుధాన్యాల సాగుపై వివరించారు. ఎంపీపీ బీమగాని సౌజన్య, జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు, ఏవో హరిప్రసాద్‌బాబు, ఎంపీటీసీ వీరారావు, రైతు వీరాటి రవీందర్‌రెడ్డి,డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి. సుదర్శన్, మాజీ సర్పంచ్ కొంగర చంద్రమౌళి ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

లాభదాయకం..

దుగ్గొండి: చిరుధాన్యాల సాగు ప్రస్తుత పరిస్థితుల్లో లాభదాయకం అని వరంగల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో జాతీయ ఆహార భద్రత మిషన్ ఆధ్వర్యంలో సోమవారం చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీఏ అవినాశ్‌వర్మ, ఏఓ దయాకర్, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ మోర్తాల రాజు, ఏఈఓలు హన్మంతు, రాజేశ్, మధు, మౌనిక పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్లినిక్ సీజ్



కొత్తగూడ: భూత వైద్యం చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల మేరకు మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలకేంద్రంలోని ఆర్ఎంపీ క్లినిక్‌ను సోమవారం అధికారులు సీజ్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ అంబరీష్ తెలిపిన వివరాల ప్రకారం ఆర్ఎంపీ వైద్యుడు శ్యాంసుందర్ కొందరి అవసరాలను ఆసరా చేసుకుని తాయత్తులు కట్టడం లాంటివి చేసినట్లు ఆధారాలు లభించాయన్నారు. ఈ మేరకు అతని క్లినిక్‌ను సీజ్ చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని భూత వైద్యం పేరుతో మోసాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైన దయ్యాలు, భూతాల పేరుతో మోసం చేసేందుకు యత్నిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ చందా నరేష్, హెడ్ కానిస్టేబుల్ బాలాజీ ఉన్నారు.

ఫోర్జరీ కేసులో నిందితుల అరెస్ట్

ఖిలా వరంగల్: తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి వ్యవసాయ భూమిని నకిలీ నాలా కన్వర్షన్ ఆర్డర్ పత్రాలను సృష్టించి భూమిని రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ ముస్కు శ్రీనివాస్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఖిలా వరంగల్ గ్రామానికి చెందిన తోటకూరి కొమురయ్య, తోటకూరి నర్సయ్య, తోటకూరి కొమురయ్యల పేరు మీద గత సంవత్సరం సెప్టెంబర్ 21న మండల తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఒక్కొక్కరికి 15 గుంటలు నకిలీ నాలా కన్వర్షన్ ఆర్డర్ పత్రాలను సృష్టించారు. నకిలీ పత్రాలను మండల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సమర్పించగా అధికారులు వారిపై భూమి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై అసలు భూ యజమానులు తహసీల్దార్‌ను నిలదీయడంతో వారి పేర్లతో తాను నాలా పర్మిషన్ ఇవ్వలేదని.. తన సంతకాన్ని ఎవరో ఫోర్జరీ చేసి ఉంటారని అనుమానాలు వ్యక్తం చేశారు. దీనిపై మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. తహసీల్దార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ పత్రాలను సృష్టించిన 15మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో పదకొండ మంది పరారీలో ఉండగా నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

భక్తులకు ఇబ్బంది కలగొద్దు



వనదేవతలను దర్శించుకుంటున్న మంత్రి



మేడారం పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
- గిరిజన, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్
- మినీ మేడారం జాతరపై అధికారులతో సమీక్ష

ఎస్ఎస్‌తాడ్వాయి: త్వరలో ప్రారంభమయ్యే మినీ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని గిరిజన సంక్షేమశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మేడారం ఐటీడీఏ క్యాంప్ ఆఫీస్‌లో మినీ మేడారం జాతరపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య, ఐటీడీఏ పీఓ అంకిత్, జెడ్పీ చైర్మన్ జగదీష్, ఏఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌లతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. మినీ మేడారం జాతర కోసం భక్తుల సౌకర్యార్థం రూ. 3.10 కోట్లతో వివిధ శాఖల ద్వారా పనులు చేపట్టామన్నారు. వనదేవతలను దర్శించుకునేందుకు సుమారు ఐదు లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రం చేయాలని, స్నాన గదులు, బట్టలు మార్చుకునే గదులు, పరిసరాలు శానిటైజ్ చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

గ్రామీణ జాతరలపై దృష్టి పెట్టాలి

గ్రామీణ ప్రాంతాలైన కొండాయి, ఐలాపూర్, బయ్యక్కపేటలో జరిగే మినీ జాతరకు అన్ని ఏర్పాట్లను సమకూర్చాలని అధికారులను మంత్రి ఆదేశించారు. జాతర పరిధిలో ఉన్న కోళ్లు, మేకలు దుకాణదారులతో సమావేశం నిర్వహించుకొని వ్యర్థాలను డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీష్ మాట్లాడుతూ కలెక్టర్‌కు రెండు మహా జాతరలను విజయవంతం చేసిన అనుభవం ఉందని, మినీ జాతర విజయవంతానికి అధికారుల సమన్వయంతో పరివేక్షణ చేస్తూ జాతర విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు మంత్రి జంపన్నవాగు పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, డీఆర్ఓ రమాదేవి, సర్పంచ్ బాబురావు, ఎంపీపీ గొంది వాణిశ్రీ, ఆలయ ఈఓ రాజేందర్, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ పోచం, ఏటీడీఓ దేశిరాం, ఆర్అండ్‌బీ ఈఈ వెంకన్న, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత, ఇరిగేషన్ డీఈఈ సదయ్య, ఇరిగేషన్ ఏఈఈ కె.అరవింద్, డీఎల్‌పీఓ దేవరాజ్, ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి ప్రేమలత, అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఓరుగల్లు ఖ్యాతిని చాటాలి

- ఎమ్మెల్యే అరూరి రమేశ్
- ముగిసిన హాకీ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేశ్

మామునూరు: క్రీడాకారులు, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ ఓరుగల్లు ఖ్యాతిని చాటాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్ తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రూ. 20 లక్షల నిధులతో హాకీ క్రీడా ప్రాంగాణాన్ని అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ ప్రాంగణంలో సీనియర్ హాకీ కోచ్ ఎండీ హుస్సేన్ ఆధ్వర్యంలో బషీర్ హుస్సేన్ (అమ్జద్) స్మారకార్థం గత రెండు రోజులుగా జరుగుతున్న హాకీ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే క్రీడల్లో మక్కువ పెంచుకున్నట్లయితే జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ప్రతి క్రీడాకారుడు వచ్చిన అవకాశాలను వదులుకోకుండా ప్రభుత్వం అందించే పోత్సాహకాన్ని స్వీకరించి ఉన్నత స్థాయిలో ఎదగాలన్నారు. అనంతరం అసిస్టెంట్ కమాండెంట్ భిక్షపతి, కార్పొరేటర్ అరుణ విక్టర్, రిటైర్డ్ పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే విజేతగా నిలిచిన ధనరాజ్ జట్టు కెప్టెన్ హిదాహిజ్‌కు ట్రోఫీ, మెమోంటోను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సిద్దిక్, రాజేందర్, ఇబ్రహింఖాన్, పండరినాథ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు



మడికొండ: కాజీపేట మండలం మడికొండ టీఎస్‌జీఓఎస్ కాలనీలోని ఖాళీ ఇంటి స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మడికొండ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు పాండ్యాల బాలకిషన్ స్థలాన్ని గ్రామానికి చెందిన పల్లపు మహేష్, పల్లపు మల్లికార్జున్, పల్లపు కుమార్‌లు కబ్జా చేసినట్లు ఫిర్యాదు చేయడంతో ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సింహారావు తెలిపారు. భూ కబ్జాదారులపై పోలీసు కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ పెడుతూ సామాన్యులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

చీటింగ్ కేసు..

కాజీపేట: కాజీపేట పట్టణంలో సోమవారం ద్విచక్ర వాహనాలను తనిఖీ చేస్తుండగా నంబర్ ప్లేటు లేకుండా తిరుగుతున్న రెండు వాహనాలను సీజ్ చేసి ఇద్దరిపై చీటింగ్ కేసు నమోద్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాగిత నితిన్ రెడ్డి, రైనేని హరికృష్ణలు జరిమానాల భారి నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను ట్యాంపరింగ్ చేసి రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు. వాహన తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. వాహనదారులు నంబర్ ప్లేట్ లేకుండా తిరిగితే జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

కాజీపేట: డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నలుగురు వాహనదారులను సోమవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి కె.విద్యాసాగర్‌రావు ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరికి రూ.1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి కాజీపేట చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా మోటం శ్రీను, పాశం రమేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు తెలిపారు. వారికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష వేసినట్లు ఆయన తెలిపారు.

ఇటుక బట్టీల్లో ఆకస్మిక తనిఖీ

మామునూరు: అనుమతి లేకుండా ఇటుక బట్టీకి వ్యవసాయ భూమిని లీజ్‌కు ఇవ్వడంతో పాటు రైతుబంధు సాయాన్ని పొందుతున్న రైతు భూమిని తహసీల్దార్, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు తనిఖీ చేశారు. ఇటీవల కొంతమంది అధికారులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం తహసీల్దార్ ఫణి కుమార్‌తో పాటు విజిలెన్స్, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు బొల్లికుంట గ్రామ శివారులోని 521 సర్వే నంబర్‌లోని భూమిలో తనిఖీ చేశారు. నాలా పర్మిషన్ లేకుండానే రైతు ఇంద్రసేనారెడ్డి తన భూమిని ఇటుక బట్టీల తయారీకి లీజ్‌కు ఇవ్వడంతో పాటు రైతు బంధు కూడా పొందుతున్నాడు. దీనిపై ప్రభుత్వాన్ని మోసం చేసి రైతుబంధు పొందుతున్న రైతుతోపాటు అనుమతిలేని ఇటుక బట్టీ వ్యాపారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది.

కారు, ద్విచక్రవాహనం ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



పరమేశ్ (ఫైల్)

తరిగొప్పుల: కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా తరిగొప్పుల మండల పరిధిలోని బొత్తలపర్రె శివారులో సోమవారం జరిగింది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... నల్లగొండ జిల్లా గుర్రంపాడు మండలం మైలాపురం గ్రామానికి చెందిన బొంత పరమేష్ (40), సత్యనారాయణ వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై కరీంనగర్‌కు వెళ్తున్నారు. ఈ సమయంలో జగిత్యాలకు చెందిన బెజ్జంకి అనిల్‌కుమార్ కారులో చౌటుప్పల్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో బొత్తలపర్రె శివారులో మూలమలుపు వద్ద ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టింది. దీంతో బైక్ వెనకాల కూర్చున పరమేష్ ఎగిరి పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


పాము కాటుతో యువకుడు..



హత్తిరాం (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: పాము కాటుతో యువకుడు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామన్నపేట కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నపేట కాలనీలో నివాసం ఉండే ఆంగోత్ హత్తిరాం (38) ఈ నెల 21న మధ్యాహ్నం ఇంట్లో మంచంపై పడుకుని ఉండగా పాము కాటువేసింది. వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య కల్యాణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కారు ఢీకొని వ్యక్తి..



ప్రమాద స్థలంలో క్షతగాత్రులు

వర్ధన్నపేట: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని దమ్మన్నపేట శివారు దుర్గమ్మగుడి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దమ్మన్నపేటకు చెందిన యాకయ్య (38), నాగరాజులు బైక్‌పై జఫర్‌గఢ్‌కు వెళ్తున్నారు. జఫర్‌గఢ్ నుంచి వర్ధన్నపేటకు వస్తున్న కారు దుర్గమ్మ గుడి సమీపంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో యాకయ్య మృతి చెందగా నాగరాజు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

వ్యక్తి ఆత్మహత్య



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

మంగపేట: మండలంలోని బాలన్నగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని నరేందర్‌రావుపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో కమలాపురంకు చెందిన బొల్లుడు ప్రవీణ్(30) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బద్రాద్రికొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన ప్రవీణ్ కమలాపురంకు చెందన స్వప్నతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి జీవనోపాధి కోసం తాపీ మేస్త్రీగా పనిచేస్తూ కమలాపురంలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం నర్సింహసాగర్‌లోని తన మేనత్త, మేనమామ చింతల సీత, చంద్రయ్య ఇంటికి వచ్చాడు. వారితో కలిసి భోజనం చేసి వారింట్లోనే పడుతున్నాడు. తెల్లవారు జామున మేనత్త, మేనమామ లేచి చూసే సరికి ప్రవీణ్ కనిపించలేదు. ఉదయం నరేందర్‌రావు గ్రామ సమీపంలోని ఓ జామాయిల్ తోట వద్ద తునికి చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని ఉండటాన్ని అటుగా వెళ్లిన పశువుల కాపర్లు గుర్తించి ఉరివేసుకున్న ఫొటోను సోషల్ మీడియాలో పెట్టారు. దీంతో విషయం తెలుసుకున్న ఎస్సై తాహెర్‌బాబా, రవికుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పు చెల్లించడానికి దొంగతనం

హసన్‌పర్తి: తీసుకున్న అప్పు చెల్లించడం కోసమే ముగ్గురు యువకులు చోరీకి పాల్పడినట్లు ఎస్సై భరత్ సోమవారం తెలిపారు. హసన్‌పర్తి మండలం అన్నాసాగరంలోని ఓ కళాశాల గర్ల్స్ హాస్టల్‌లో ఆదివారం ప్రవేశించి ల్యాప్‌టాప్‌తో పాటు మూడు సెల్ ఫోన్లు దొంగలించిన ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన తోట చరణ్ తమిళనాడులోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువున్నారు. వ్యక్తిగత అవసరాల నిమిత్తం తన వద్ద ఉన్న ఐఫోన్‌ను ఓ వ్యక్తి వద్ద తాకట్టుపెట్టి అప్పుగా రూ.30వేలు తీసుకున్నాడు. కళాశాలకు సంక్రాంతి సెలవులు ప్రకటించడంతో అదే కాలేజీలో చదువుతున్న బాజిరెడ్డి అనే స్నేహితుడితో కలిసి సూర్యాపేటకు బయలుదేరారు. ఇంటికి వెళ్తే ఐఫోన్ గురించి తల్లిదండ్రులు ప్రశ్నిస్తారని భయపడి హైదరాబాద్‌లోని తన బాబాయి వద్దకు చేరుకున్నాడు. అక్కడే సెలవులు పూర్తి కావడంతో తన బాబాయి కొడుకు మధుకర్‌ను వెంటబెట్టుకుని తమిళనాడుకు బయలుదేరారు. ఈ క్రమంలో మధిర ఎక్స్‌ప్రెస్ ఎక్కేందుకు ఆదివారం వరంగల్‌లో రైలు దిగారు. దొంగతనం చేసి అప్పు చెల్లించాలని నిర్ణయానికి వచ్చారు. దీనికి హాస్టల్‌లే మంచిదని భావించి అన్నాసాగరంలోని ఓ గర్ల్స్ హాస్టల్‌లో ల్యాప్‌టాప్, మూడు మొబైల్స్ చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కారు. ఇందులో బాబిరెడ్డి పరారీలో ఉండగా చరణ్, మధుకర్‌లను రిమాండ్‌కు తరలించారు.

వ్యభిచారం ముసుగులో దోపిడీలు



అరెస్ట్ చూపుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వ్యభిచారం ముసుగులో దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు మహిళలను మామునూరు పోలీసులు అరెస్టు చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ వెంకటలక్ష్మి తెలిపారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు కొత్తూరు గ్రామానికి చెందిన విజయ్‌కుమార్, పర్వతగిరికి చెందిన రాయపురం సరిత, కేసముద్రంకు చెందిన కోడం స్వరూప, సూనె స్వప్నలు కలిసి ఒక ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇందులో ముగ్గురు లేడీ కిలాడీలు ముఠాగా ఏర్పడి బస్‌స్టేషన్‌లలో అమాయకులైన యువకులను తమ సైగలతో ఆకర్షించి వారిని ప్రలోభ పెట్టి ఓ వాహనంలో ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశాలకు తీసుకెళ్లే వారు. ఈ క్రమంలో విజయ్‌కుమార్ సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకుని యువకులను బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇప్పటికీ మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో రూ.20వేలు, సెల్‌ఫోన్, గీసుకొండ పీఎస్ పరిధిలో రూ.3వేలు, సెల్‌ఫోన్‌లను బలవంతంగా దోచుకున్నారు. ఈ ముఠాపై ప్రత్యేక నిఘా ఉంచి మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తన సిబ్బందితో సోమవారం రాంగోపాల్‌పురం వద్ద నిందితురాళ్లను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏసీపీ నరేష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్, ఎస్సై రాజిరెడ్డి, కానిస్టేబుళ్లు సర్దార్‌పాషా, రోజాలను ఈస్ట్‌జోన్ డీసీపీ అభినందించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



బహుమతి అందజేస్తున్న సునీత, తదితరులు

భూపాలపల్లి అర్బన్: మూడు రోజులుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న రాష్ట్ర అంతర్ జిల్లాల పోటీలు సోమవారం ముగిశాయి. తొమ్మిదవ తెలంగాణ రాష్ట్ర అంతర్ జిల్లాల పోటీల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి టీమ్‌లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో రంగారెడ్డి–మెదక్ జిల్లాల జట్లు తలపడగా రంగారెడ్డి జిల్లా 7–3 తేడాతో ఘన విజయం సాధించింది. పోటీల ముగింపు కార్యక్రమానికి జిల్లా క్రీడల అధికారిణిని బుర్ర సునీత ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అభినవ వినయ్‌కుమార్, సింగరేణి స్పోర్ట్స్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, టీబీజీకేఎస్ నాయకులు బడితెల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


‘అనురాగ వీచికలు’ ఆవిష్కరణ



అనురాగ వీచికలు సంపుటిని ఆవిష్కరిస్తున్న హరికృష్ణ

హన్మకొండ కల్చరల్: హన్మకొండ రెడ్డికాలనీకి చెందిన కవయిత్రి మేరుగు అనురాధ రచించిన సున్నితం ప్రక్రియకు సంబంధించిన ‘అనురాగ వీచికలు’ సంపుటిని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ఆవిష్కరించారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జరిగిన వివిధ జిల్లాలకు చెందిన సాహితీవేత్తలు రచించిన పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, ప్రముఖ సాహితీవేత్తలు నాగేశ్వరం శంకరం, నెల్లుట్ల సునీత, నివేదిత, అమ్మంగి వేణుగోపాల్, అయినంపూడి శ్రీలక్ష్మి, ఆనందాచారి తదితరులు పాల్గొన్నారు.

కేయూలో మెస్‌ల రీఓపెన్



కేయూలోని అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో భోజనం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కేయూలో సంక్రాంతి సెలవులు ఈనెల 20న ముగియడంతో సోమవారం విద్యార్థుల రాకతో క్యాంపస్‌లోని హాస్టళ్లు అన్నింటిని ఓపెన్ చేయడంతో మెస్‌లను కూడా రీఓపెన్ చేశారు. కామన్‌మెస్‌లో మరమ్మతు కొనసాగుతుండటంతో ప్రత్యామ్నాయంగా కేయూలోని అడ్మిషన్ల డైరెక్టరేట్‌లో డైనింగ్‌ను ఏర్పాటు చేసి మెస్ సౌకర్యం కల్పిస్తున్నారు. తొలిరోజు 300 మంది విద్యార్థులకు భోజనం కల్పించినట్లు సమాచారం. పద్మాక్షి మహిళా హాస్టల్ లోనూ సోమవారం మెస్ సౌకర్యం ఏర్పాటు చేశారు. రెండుమూడు రోజుల్లో విద్యార్థుల సంఖ్య మరింత పెరుగనుంది.

అత్యాచారం, హత్య కేసులో నేరస్తుడికి జీవిత ఖైదు

- రూ.4 లక్షల జరిమానా



వరంగల్ లీగల్: ప్రేమిస్తున్నాను.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేయగా అధిక రక్త స్రావమై మృతి చెందిన యువతి శవాన్ని ఆమె ఇంటికి సమీపంలో రోడ్డుపై పడేసి పారిపోయిన నేరంలో జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన నేరస్తుడు పులి సాయికుమార్‌కు జీవిత ఖైదు జైలు, రూ.4లక్షల జరిమానా విధిస్తూ సోమవారం హనుమకొండ జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి జయలక్ష్మి తీర్పు వెల్లడించారు. హన్మకొండ దీన్‌దయాల్‌నగర్‌లో అద్దెకు ఉంటూ సమీపంలో కూరగాయల దుకాణం నడుపుకుంటూ జీవిస్తున్న గాదం మల్లయ్య చిన్న కుమార్తె మానస (18) ఇంటర్ చదువు మానేసి తల్లిదండ్రులకు కూరగాయల దుకాణం వద్ద సహాయపడుతుంది. ఈ క్రమంలో సమీపంలో ఉన్నటువంటి మాస్టర్‌జీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న పులి సాయికుమార్ ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మానసను నమ్మించి నవంబర్ 27, 2019న కారులో కాజీపేట రాంపూర్ రైల్వే ట్రాక్ దగ్గరకు తీసుకెళ్లాడు. అక్కడ మానసను అత్యాచారం చేయడంతో తీవ్ర రక్త స్రావం కావడంతో మృతి చెందింది. మృతురాలి సోదరుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సాయికుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో పలు సెక్షన్ల కింద జైలు శిక్ష విధించారు. కేసును పోలీసు అధికారులు సిహెచ్ అజయ్‌కుమార్, షుకుర్ పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ వెంకటస్వామి పర్యవేక్షణలో కానిస్టేబుల్ వి.రాజు, హోంగార్డు శ్రీధర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

మోసాలకు పాల్పడిన వ్యక్తిపై పీడీయాక్టు



పీడీయాక్టు ఉత్తర్వులను అందజేస్తున్న సదన్‌కుమార్

వరంగల్ క్రైం: ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడిన నిందితుడిపై వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ పీడీయాక్టు ఉత్తర్వులను జారీ చేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని యువతి యువకులను మోసం చేస్తున్న మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన దాకురి భిక్షంపై సీపీ జారీ చేసిన పీడీయాక్టు ఉత్తర్వులను వర్ధన్నపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గడ్డం సదన్‌కుమార్ నిందితుడికి ఖమ్మం కారాగారంలో అందజేశారు. అనంతరం నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఉద్యోగాల పేరుతో యువతి, యువకులను మోసం చేస్తూ లక్షల్లో డబ్బు వసూళ్లకు పాల్పడినట్లు ఆయన తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని సీపీ తెలిపారు.